క్లుప్తంగా

చార్‌మినార్ జోన్‌లో కలపాలి



ఎమ్మెల్యేకు వినతపత్రం అందిస్తున్న యువకులు

నర్సాపూర్: నర్సాపూర్ డివిజన్‌ను చార్‌మినార్ జోన్‌లో కలిపేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డిని పలువురు యువకులు కోరారు. నర్సాపూర్‌కు చెందిన యువకులు నవీన్, భరత్‌రాం, అభిరాం, నవదీప్, ఓంకార్, ఉదయ్ కిరన్, దీపక్, సుజిత్ తదితరులు బుధవారం సునీతారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామానికి చెందిన లంబాడి సునీతకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం తన నివాసంలో అందజేశారు.

నవోదయకు ఎంపికపై హర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలానికి చెందిన పలువురు విద్యార్థులు నవోదయ పరీక్షకు ఎంపిక కావడంపై ఎంఈఓ వెంకటేశం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక డాన్‌బాస్కో పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకాంత్, శశిధర్‌లు నవోదయకు ఎంపిక కావడంతో వారిని ఆయన సన్మానించారు. విద్యార్థులు కష్టపడి చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ దీపస్టీఫెన్, అనిల్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఫణిందర్, జ్యోతి తదితరులున్నారు.

బీసీ హాస్టల్ భవనం పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ పాత భవనాన్ని నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం కౌడిపల్లి డిగ్రీ కళాశాల నర్సాపూర్ డిగ్రీ కళాశాల(చింతకుంట)లో కొనసాగుతోంది. దీంతో కౌడిపల్లిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత బీసీ హాస్టల్ భవనాన్ని కేటాయించేందుకు ఆర్‌డీఓ, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదర్, తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీహరి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సూచనలు చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ నాగేశ్వర్, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగీరథ నీరు సక్రమంగా ప్రజలకు వచ్చేలా చూడడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధి పనులు ఉదయం వేళల్లో కూలీలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. పారిశుద్ధ్య చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అనీల్, ఇతర సిబ్బంది ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన పాదయాత్ర

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రం మెదక్ వరకు వయా శెట్టిపల్లి కలాన్ మీదుగా ధ్వంసమైన బీటీ రోడ్డును రెండు లైన్‌ల రహదారిగా విస్తరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర రెండవరోజూ కొనసాగింది. మొదటిరోజు వెల్దుర్తి నుంచి రామాయిపల్లి వరకు పాదయాత్ర చేపట్టగా, రెండోరోజు బుధవారం రామాయిపల్లి నుంచి మెదక్ వరకు చేశారు. పాదయాత్రలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పాల్గొని మాట్లాడుతూ.. మండల ప్రజల చిరకాల వాంఛ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంతలమయమైన రోడ్డులో ప్రయాణించడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రభుత్వం స్పందించి రెండు లైన్‌ల రోడ్డుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌరి, నరేందర్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డు ఎత్తి వేయాలి

నర్సాపూర్: ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని జేఏసీ నాయకులు కుమ్మరి సంఘం నాయకులు ప్రసాద్, నగేశ్ డిమాండ్ చేశారు. డంప్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 36వ రోజుకు చేరాయి. దీక్షలో కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ప్రసాద్, నగేశ్ మాట్లాడుతూ.. డంప్‌యార్డును ఎత్తి వేయాలని కోరారు. దీక్షలో జేఏసీ నాయకులు రాజేందర్, సంఘం నాయకులు సురేందర్, రమేశ్, లక్ష్మణ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ ప్రయోగశాలలు

- కార్యాలయాలుగా సైన్స్ ల్యాబ్ భవనాలు
- దశాబ్ద కాలంగా ప్రయోగాలు తెలియని విద్యార్థులు



జెడ్పీ నిధులతో సరఫరా చేసిన సైన్స్ పరికరాలు వృథాగా పడి ఉన్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రయోగశాలలు లేక శాస్త్రీయ విద్యకు దూరమవుతున్నారు. దశాబ్ద కాలంగా పాఠశాలలకు సైన్స్ పరికరాలు, సామగ్రిని సరఫరా చేయకపోవడంతో ప్రయోగశాలలు మూలనపడ్డాయి. ప్రభుత్వం సైన్స్ ల్యాబ్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రయోగాలకు 8 , 9, 10 తరగతుల విద్యార్థులు దూరమయ్యారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించేందుకు జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి భవనాలు నిర్మించారు. కానీ ఈ భవనాలను పాఠశాల అధికారులు మాత్రం కార్యాలయాలకు వాడుకుంటున్నారు. మెదక్ జిల్లాలో 147 జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో కేవలం 20 జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం 2019–2020లో సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణాలకు రూ.9 లక్షలు మంజూరు చేసింది. హవేలిఘనపూర్ మండలంలో 3 జెడ్పీ పాఠశాలు, మెదక్‌లో 2, నిజాంపేట1, రామాయంపేట 2, అల్లాదుర్గం 1, చిలిపిచెడ్ 1, టేక్మాల్ 2, చెగుంట 2, కౌడిపల్లి 1,నర్సాపూర్ 1, శివ్వంపేట 2, వెల్దుర్తి 3 పాఠశాలలకు భవనాలు మంజూరయ్యాయి. జిల్లాలో మరో 127 జెడ్పీ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ భవనాలు లేవు. కొన్ని మండలాల్లో రెండు, మూడు సైన్స్ భవనాలు మంజూరైతే, మరి కొన్ని మండలాలకు మంజూరు కాలేదు. అల్లాదుర్గం మండలంలో గడిపెద్దాపూర్, చిల్వెర, అల్లాదుర్గం బాలికల, బాలుర జెడ్పీ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. అల్లాదుర్గంలో ప్రయోగాల ద్వారా బోధన చేయకపోవడంతో పరికరాలు మూలనపడ్డాయి. చిల్వెర, గడిపెద్దాపూర్ పాఠశాల విద్యార్థులు సహితం ప్రయోగశాలలంటే తెలియదు.

ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక చేశారు. ఈ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి 2020లో ప్రభుత్వం రూ.9 లక్షల మంజూరు చేసింది. ఈ నిధులతో సైన్స్ ల్యాబ్‌కు భవనం నిర్మించారు. భవనం నిర్మించి ఐదేళ్ల గడిచిన సైన్స్ పరికరాలు సరఫరా చేయకపోవడంతో, భవనాన్ని కార్యాలయాలుగా వాడుకుంటున్నారు. గతంలో మంజూరైన సామగ్రిని పాఠశాల సైన్స్ టీచర్లు అందులో ఉంచకపోవడంతో సామగ్రి ఆల్‌మారాల్లో తుప్పుపట్టిపోయింది.

సామగ్రి, పరికరాలేవీ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రి, బయోసైన్స్ సబ్‌జెక్టులకు సరైన ల్యాబ్ సౌకర్యం లేక బోధనతోనే సరిపెడుతున్నారు. ఏడాది క్రితం సైన్స్ ల్యాబ్‌కు సంబంధించి భవనాలు నిర్మించినా.. సామగ్రి, పరికరాలు మాత్రం ప్రభుత్వం సరఫరా చేయలేదు. జిల్లాలో 20 పాఠశాలల్లో సైన్స్ భవనాలు నిర్మించినా అవి నిరూపయోగంగా మారాయి.

జెడ్పీ నిధులతో..

మండలంలోని మూడు జెడ్పీ పాఠశాలలకు రెండు నెలల క్రితం జిల్లా పరిషత్ నిధులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయో సైన్స్ మెటీరియల్ సరఫరా చేశారు. అల్లాదుర్గం బాలుర, బాలికల జెడ్పీ పాఠశాల, ముస్లాపూర్ పీఎంశ్రీ పాఠశాలలకు రూ.రెండు లక్షల విలువ గల సైన్స్ మెటీరియల్ సరఫరా చేశారు. ఈ పరికరాలు పెట్టేందుకు ఆల్‌మారాలు, బీరువాలు లేకపోవడంతో వినియోగించడం లేదు.

ప్రయోగాలు చేయించాలి



సైన్స్ బోధన ప్రయోగాల ద్వారా సులువుగా అర్థం అవుతుంది. ప్రయోగశాలలు లేక ప్రయోగాలకు దూరం అవుతున్నాం. ప్రతీ పాఠశాలలో ప్రయోగాలు చేయిస్తేనే ప్రయోజనం ఉంటుంది.

– అనూరాధ, విద్యార్థిని అల్లాదుర్గం

ప్రత్యేక నిధులు కేటాయించాలి



పాఠశాలల్లో సైన్స్ బోధనకు ప్రతి జెడ్పీ పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. సరైన ల్యాబ్ సౌకర్యం, మెటిరియల్ లేక ప్రయోగాలు చేయించలేక పోతున్నాం. ప్రయోగాల ద్వారా బోధన చేస్తే విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుంది.

– కృష్ణ, సైన్స్ టీచర్ అల్లాదుర్గం

ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలకు పీఎంశ్రీ కింద జె డ్పీ నిధులతో రెండు సార్లు సైన్స్ మెటీరియల్ సరఫరా చేయడం గమనార్హం.

ఉపాధి పనుల్లో సర్వర్ డౌన్



చేగుంట(తూప్రాన్): మక్కరాజిపేటలో వసతులు లేకుండా జరుగుతున్న ఉపాధి పనులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి పనులు చేసినప్పటికీ సర్వర్ డౌన్ కావడంతో తమ ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో చేసిన పనులకు కూలీ డబ్బులు వస్తాయో, లేదో అన్న అనుమానంతో కూలీలు ఉన్నారు. మండల పరిధిలోని చండూర్ గ్రామంలో సోమ, మంగళ వారాల్లో సర్వర్ డౌన్ కావడంతో కూలీల వివరాలు అప్‌లోడ్ చేయలేదు. బుధవారం ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్ సత్యంను వివరణ కోరగా, రెండు రోజులు సర్వర్ డౌన్ ఉన్న విషయం వాస్తవమేనన్నారు. బుధవారం సర్వర్ పని చేసిందని, పని చేసిన కూలీలు కూలీ డబ్బుల గురించి ఆందోళన చెందాల్సి అవసరం లేదన్నారు. సర్వర్ డౌన్ ఉన్న విషయాన్ని ముందుగానే డీఆర్‌డీఓకు తెలియజేశామని, పనులు చేసిన కూలీల వివరాలు తెలియజేయాలని తెలిపారు.

నీటి వసతి కల్పించలేదు

చేగుంట(తూప్రాన్): ఉపాధిహామీ కూలీలకు ఎలాంటి సౌకర్యం కల్పించకుండానే పనులు చేయిస్తున్నట్లు మక్కరాజిపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారు మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో ఎండలో ఉపాధి పనులు నిర్వహిస్తుండగా సేద తీరేందుకు కనీసం షామియానా ఏర్పాటు చేయకపోగా దాహం తీర్చేందుకు నీటి వసతిని కల్పించలేదన్నారు. కూలీలకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడితే ఎవరు బాధ్యులని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఉపాధి పనుల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం మండల పరిధిలోని రామోజిపల్లి, బూర్గుపల్లి, టింకటి , మల్కాపూర్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు మట్టి రోడ్లు, పూడిక తీత తదితర పనులను ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ పరిశీలించారు. కూలీలకు ఉపాధి కొలతపై అవగాహన కల్పించాలని టీఏ, ఎఫ్‌ఎలకు సూచించారు.

రంగంపేట తైబజార్ వేలం రూ.2.10 లక్షలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ తైబజార్ వేలం బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొమ్ముల సాయాగౌడ్ వేలంపాటలో రూ.2.10 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఎంపీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రాజు, కారోబార్ వంశీ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో తైబజారు వేలం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో బుధవారం 2025–26 సంవత్సరానికి తైబజార్ వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో వెల్దుర్తి పట్టణానికి చెందిన ఆదర్శ్ అనే యువకుడు రూ.10.67 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడు పంచాయతీకి ఆదాయం రెండు లక్షలుపైగా అదనంగా వచ్చింది. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఇంటింటి సర్వే

నర్సాపూర్‌రూరల్: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం యూనిట్–1 విద్యార్థులు వేసవి శిబిరంలో భాగంగా బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని నిరక్షరాస్యులు, నిరుద్యోగులు, కులవృత్తులు, రైతులతో పాటు, ఆయా వర్గాలకు చెందిన 150 కుటుంబాలను సర్వే చేసి, వారి స్థితిగతుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సురేష్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మెదక్ ఆర్డీఓ రమాదేవి



నిజాంపేటలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీఓ రమాదేవి

నిజాంపేట(మెదక్): మండలంలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారితో మెదక్ ఆర్డీఓ రమాదేవి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం మండలంలోని గ్రామాలను సందర్శించి తాగునీటి కొరత ఉందో లేదో పరిశీలించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే మండల స్థాయి కార్యాలయాల్లో దరఖాస్తుదారులకు తాగునీటిని ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పిటిషన్లు వంటి అన్ని పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండలంలో నూతనంగా తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ పాఠశాల నిర్మాణాలకు ప్రతిపాదించిన భూమిని ఆర్డీఓ రమాదేవి సందర్శించి భూ యజమానులతో సంభాషించారు. అనంతరం ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిదిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను మెదక్ ఆర్డీఓ రమాదేవి సందర్శించారు. బుధవారం పట్టణంలోని వివేకనంద విద్యాలయం, సోషల్ వేల్పేర్ విద్యాలయాలల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రామాయంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'నో హెల్మెట్ నో ఎంట్రీ' బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే ప్లాస్టిక్ రహిత వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం కార్యాలయంలో తాగు నీటి సమస్య తీర్చడానికి తాగునీటి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజిని , ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమావాస్యకు ఎలాంటి గ్రహణం లేదు

శివ్వంపేట(నర్సాపూర్): అమావాస్య సందర్భంగా శనివారం ఎలాంటి గ్రహణం లేదని వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ బుధవారం తెలిపారు. మన ప్రాంతంలో లేని గ్రహణం గురించి ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, నియమాలు పాటించాల్సిన అవసరం లేదన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఐపీఎల్ సీజన్ ప్రారంభమైందని, యువత క్రికెట్‌పై మక్కువతో బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యువత సులభంగా డబ్బు సంపాదిస్తామనే అత్యాశతో బెట్టింగ్‌లకు పాల్పడి, ఉన్న డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు అప్పులు చేసి, తనతో పాటు వారి కుటుంబాలను వీధిపాలు చేసి, చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. యువత క్రికెట్‌తో పాటు, ఎలాంటి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.

ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని దాడి

మెదక్ మున్సిపాలిటీ: ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని మహిళపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన ప్రముఖ కిరాణ వ్యాపారి సాయిదీప్ రమేశ్ అప్పుల భారంతో గత నెల ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త అప్పులవారి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి రెండో భార్య గాయత్రీ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రమేశ్ కుటుంబంలో నెలకొన్న ఆస్తి వివాదంపై పెద్దల సమక్షంలో ఆదివారం పంచాయతీ నిర్వహించారు. కరూర్ వైశ్య బ్యాంక్‌లో తీసుకున్న రూ.14 కోట్ల రుణం మృతుడి కుమారుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడని బాధితురాలు తెలిపింది. ఈ విషయంపై అడిగిన తనపై వెంకటరమణతో పాటు మరికొంత మంది దాడి చేసినట్లు బాధితురాలు గాయత్రీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

నర్సాపూర్: పట్టణంలోని కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయని కొత్త అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఆయన నూతన కమిటీ ప్రతినిధుల వివరాలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అరీఫ్‌మోమినొద్దీన్, కల్చరల్ సెక్రటరీగా సుధాకర్, మహిళా రిప్రజెంటేటివ్‌గా స్వరూపరాణి ఎన్నికయ్యారని శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. కార్యవర్గ సభ్యులుగా ఇక్బాల్ అలీజాఫర్, ఖాజా మోహినొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, శ్రీధర్‌రెడ్డిలు ఎన్నికయ్యారని అన్నారు.



నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అంగన్‌వాడీల్లో మెనూ పాటించాలి



నర్సాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న సీడీపీఓ హేమభార్గవి

నర్సాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలని సీడీపీఓ హేమభార్గవి సూచించారు. ఆమె బుధవారం పట్టణంలోని సునీతారెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించి పిల్లలకు, సెంటరుకు వచ్చే తల్లులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పిల్లలు, తల్లులతో కలిసి సీడీపీఓ భోజనం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వారిని ఆదేశించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హవేళిఘణాపూర్(మెదక్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హవేళిఘణాపూర్, ఔరంగాబాద్ అంగన్‌వాడీలను తనిఖీ చేసి విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందన్నారు.

ఆర్థిక సాయం



శ్రీనివాస్ కుటుంబీకులకు ఎఫ్‌డీ పత్రాలను అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు నర్సాపూర్ మండల ఉపాధ్యాయులు సేకరించిన డబ్బుల ఎఫ్‌డీని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అందించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మండల విద్యాధికారి తారాసింగ్ మాట్లాడుతూ.. తమ మండల పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులు రూ.లక్ష 15 వందల రూపాయలను సేకరించి మృతుడి పిల్లల పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి సంబంధిత పత్రాలను డీఈఓ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌమ్య, భీంమ్లా, అశోక్, ఆపరేటర్లు రూప, బాలాగౌడ్ తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి: ఏఓ



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శ్వేతా కుమారి

కొల్చారం(నర్సాపూర్): భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత కాలంలో వరి పంట సాగుచేసిన రైతులు నీటిని పొదుపుగా వాడుకొని, పంటను సంరక్షించుకోవాలని ఏఓ శ్వేతా కుమారి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎనగండ్ల గ్రామంలో వరి పంట పొలాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ అంబిక, రైతులు ఉన్నారు.

నల్లపోచమ్మ హూండీ ఆదాయం రూ. 6.74లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం హూండీ ఆదాయం రూ. 6,74 లక్షలు వచ్చినట్లు ఈఓ రంగారావు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద జాతరతో పాటు మూడున్నర నెలలకు సంబంధించి హూండీ ఆదాయాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సమక్షంలో భక్తులు హూండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ పుణ్య, డైరెక్టర్లు ప్రభుచారి, పర్వతాలు, రాములు, శంకర్‌గౌడ్, భిక్షపతి, రాజరాజేశ్వరీ సేవాసమతి కోఆర్డినేటర్ సునీతారెడ్డి, సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **లక్ష్మీనర్సింహస్వామికి బోనాలు**



అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో బుధవారం లక్ష్మీనర్సింహ స్వామి 26 వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు బోనాలతో ఊరేగించి స్వామి వారికి సమర్పించారు.

◆ **చేగుంటలో చలివేంద్రం ఏర్పాటు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మక్కరాజిపేట రోడ్డులో గ్రామానికి చెందిన నాయకులు పరంజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, భాగ్యరాజ్, రాజాగౌడ్, ఆగం, గ్రామస్తులు ఉన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరు పేదలపాలిట సీఎంఆర్‌ఎఫ్ వరంగా నిలుస్తుందని మండల పరిధిలోని రాందాస్‌గూడ మాజీ సర్పంచ్‌లు యాదగిరి, వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు గ్రామానికి చెందిన గాండ్ల సత్యనారాయణకు రూ. 28.5 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు బాబురావు, నాయకులు శేఖయ్య, మల్లేశం పాల్గొన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో శ్రీరమాసహిత వీరవేంకట సత్యనారాయణస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉత్సవాల్లో భాగంగా గ్రామ పురోహితుడు బాపూశర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద హోమం చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **28న దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు బోనాలు, రాత్రి 7 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు ఉగాది సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తామని వారు అన్నారు.

◆ **మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్**

పాపన్నపేట(మెదక్): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తమ్మాయపల్లిలో ఎల్లమ్మ కల్యాణోత్సవం, బోనాల పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, నాయకులు శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బుధవారం పట్టణంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

◆ **కన్నారం పాఠశాలలో స్వయం పరిపాలన**



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కన్నారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా వర్షిత్, హెచ్‌ఎంగా శేషుతోపాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు అశోక్, అర్చన, మంజుల ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.